క్లుప్తంగా

ముగిసిన ఏకాహం



భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు

అడ్డతీగల: స్థానిక కోదండ రామాలయంలో ముక్కోటి ఏకాదశి వేకువజాము నుంచి ప్రారంభమైన ఏకాహం ఆదివారం ఉదయం సీతారాముల వారికి మహా మంగళ హారతితో ముగిసింది. సాయి భజన మండలి, లలిత సత్సంగ సభ్యులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భజన కళాకారులు ఏకాహం పురస్కరించుకొని నిరాటకంగా 24గంటల పాటు భక్తిగీతాలు, భజనలు చేశారు. లలితా సత్సంగ సభ్యులు సీతారామచంద్రస్వామి వారికి మహా మంగళ హారతి నిచ్చి ఈ కార్యక్రమాన్ని ముగించారు.

దుస్తులు, వంటపాత్రల వితరణ



సామగ్రి అందజేస్తున్న స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు

చింతూరు: భారత్ వికాస్ పరిషత్, ఎస్కేసీ ట్రస్ట్, సేవాభారతి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ఎర్రగొండ పాకల, టేకులొద్దికి చెందిన కొండరెడ్డి కుటుంబాలకు దుస్తులు, వంటపాత్రలు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. వితరణలో భాగంగా వంటపాత్రలు, దుస్తులతో పాటు కిరాణా సరకులతో కూడిన 120 కిట్లను కొండరెడ్డి కుటుంబాలకు పంపిణీ చేశారు. ఎంవీఎస్ఎన్ ప్రసాద్, వెంకటరమణ, జగదీష్ గుప్తా, రామయ్య, మాధవ్, డాక్టర్ గంగాధరప్రసాద్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత



కులుపాడులో వాలీబాల్ కిట్‌ను అందజేస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

జి.మాడుగుల: గిరిజన యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ తెలిపారు. మండలంలో గెమ్మెలి పంచాయతీ కె.పెదబయలు గ్రామానికి చెందిన గిరిజన యువతకు ఆదివారం వాలీబాల్ కిట్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

రగ్గుల పంపిణీ



రగ్గులు పంపిణీ చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు స్వామి, సంస్థ ప్రతినిధులు

అనంతగిరి: మండలంలోని పెదబిడ్డ పంచాయతీ దనకోట, బందవలస, గొప్పులవలస గ్రామాల్లో ఆదివారం మాతృభూమి సేవా సంస్థ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రేగబోయిన స్వామి చేతుల మీదుగా నిరుపేద గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. ఏజెన్సీలోని మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సంస్థ సభ్యులను కోరారు. సంస్థ సభ్యులు నగేష్, గోపాలరావు, మాజీ సర్పంచ్ ధర్మనాయుడు, రమణ పాల్గొన్నారు.

కొత్తూరు పంచాయతీ కొత్తవలస, తోటవలస గ్రామాల్లో ఆదివారం అమ్మ చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలోని గిరిజనులకు రగ్గులు పంపిణీ చేశారు. మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడతామని, ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు తెలిపారు. బాబూరావు, నారాయణరావు, నాయుడు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు

డుంబ్రిగుడ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలు ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతాయని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఉషారాణి తెలిపారు. ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకున్న క్రీడాకారులు పాల్గొవాలని కోరారు.

ఇంటింటా జల్ ధారలు





సిరిగిండలపాడులో వాటర్ ట్యాంకు







ముసురుమిల్లి, బొర్నగూడెం, దారగూడెంలోని ఇళ్లలోని కుళాయిల వద్ద తాగునీరు పట్టుకుంటున్న గ్రామస్తులు



బి.రామన్నపాలెంలో కొళాయిను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటలక్ష్మి

జోరుగా ఇంటింటా కుళాయి పనులు

- జల్‌జీవన్ మిషన్‌తో తీరుతున్న వెతలు
- శరవేగంగా ఓవరహెడ్ ట్యాంకుల నిర్మాణాలు
- కోట్లాది రూపాయలతో గ్రామాల్లో పైపులైన్ పనులు

మండలం: రంపచోడవరం

పంచాయతీలు	గ్రామాలు
19	70
జనాభా	**జేజేఎం పనులు చేపట్టిన గ్రామాలు**
39,351	40

నిధుల కేటాయింపు: రూ. 465.59 లక్షలు

లబ్ధిపొందుతున్న ప్రజలు: 11,534

రంపచోడవరం: ఏళ్ల తరబడి తాగునీటి కోసం మండలవాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రమైన తాగునీటి సమస్య ఉండడంతో గ్రామస్తులు గుక్కెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. పాలకులకు పలుమార్లు వినతులు ఇచ్చినా పట్టించుకునే దాఖలాలు లేవు.. అడుగంటిన బావులు.. పాడైన బోర్లు వలన తాగునీటి ఎద్దడి నెలకొంది. గత్యంతరం లేక గ్రామానికి సుదూర ప్రాంతాల్లో ఉన్న నీటి వనరుల నుంచి నీళ్లు తెచ్చుకునే దుస్థితి ఉండేది. కలుషిత తాగునీటి వల్ల తరచూ రోగాల బారిన పడేవారు. అన్ని కాలాల్లో తాగునీటి సమస్య ఉండేది.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో తాగునీటి పథకాలు ఏర్పాటుచేసి పైపులైన్‌ల ద్వారా నీటి సరఫరాకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఏళ్లతరబడి వెంటాడిన తాగునీటి సమస్య పరిష్కారం కావడంతో మండలవాసులు సర్వత్రా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటికీ కుళాయి

జలజీవన్ మిషన్ పథకం మండలంలోని ప్రజల దాహార్తిని తీరుస్తోంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ప్రతీ ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేస్తోంది. రంపచోడవరం మండలంలో రూ. 465.59లక్షల వ్యయంతో 40 పనులను ఈ పథకంలో చేపట్టి పూర్తి చేశారు. ఈ పథకం ద్వారా 19 పంచాయతీల పరిధిలో గల 38 గ్రామాల్లో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు.లంకపాకలు, ఆకూరు, యర్లమామిడి, జగమెట్లపాలెం, నల్గొండ, తాళ్లపాలెం, చెరువూరు, దేవరాతిగూడెం, దిరిసినపల్లి, కొమరవరం కాలనీ, జాగరంపల్లి, సీతపల్లి, ధారమడుగుల, బోర్నగూడెం, గిన్నెపల్లి, గాంధీనగరం, చీడిపాలెం తదితర గ్రామాల్లో పనులు పూర్తి చేసి ప్రతీ ఇంటికి సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా పనులను త్వరితగతిన పూర్తి చేసి తాగునీటి పథకాలు, పైపులైన్లు,కుళాయి కనెక్షన్‌లు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి మండలంలో ప్రజల తాగునీటి సమస్యతో సమమతమవుతున్నారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ విషయమై రంపచోడవరం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టిన పనులు అన్నీ పూర్తయినట్టు చెప్పారు. నిర్వహణ బాధ్యతలు సక్రమంగా నీటి సరఫరా బాధ్యతలు పంచాయతీలకు అప్పగించామన్నారు. ప్రతి ఇంటికి సమృద్ధిగా సురక్షిత తాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు.

ఆనందంగా ఉంది



గతంలో గ్రామం శివారు వరకు నీరు సరఫరా జరిగేది కాదు. జలజీవన్ మిషన్ పథకం ద్వారా సిరిగిండలపాడు గ్రామంలో ట్యాంకు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ఎంతో కాలం ఉన్న నీటి సమస్య తీరింది. చాలా ఆనందంగా ఉంది.

– రమేష్, సిరిగిండలపాడు

రోజూ తాగునీటి సరఫరా



ఏళ్ల తరబడి నీటి సమస్య ఉండేది. జల్‌జీవన్ మిషన్ ద్వారా సమస్య తీరింది. ప్రతీ ఇంటికి కుళాయి ఏర్పాటుతో నీటి సమస్య తీరింది. ప్రతీ రోజు గంట పాటు నీటిని సరఫరా చేస్తున్నారు. మా నీటి కష్టాలు తీరాయి. జగనన్నకు రుణపడి ఉంటాం.

– పాలోజు కాంతం, సిరిగిండలపాడు

ఇబ్బందులు తప్పాయి



వృద్ధాప్యంలో ఉన్న నేను తాగునీటి కోసం నానా అవస్థలు పడేదాన్ని . పంచాయతీకి కుళాయి వచ్చేది కాదు. గ్రామ శివారు ఉన్న మా పరిస్థితి అర్థం చేసుకుని కొత్తగా మంచినీటి సరఫరా కోసం ఏర్పాట్లు చేశారు. ఇప్పుడు ఇబ్బంది తప్పింది. చాలా సంతోషంగా ఉంది.

– పి పండమ్మ, సిరిగిండలపాడు

సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సంతాపం

గంగవరం : రంపచోడవరం మండలం గెద్దాడ గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జియ్యంపాలెం పంచాయతీ సర్పంచ్ కంగాల సుబ్బలక్ష్మి మరణించారు. సుబ్బలక్ష్మి మృతికి ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్(బాబు) పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేశారు. సర్పంచ్ సుబ్బలక్ష్మి మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సర్పంచ్ మృతికి ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, వైస్ ఎంపీపీలు గంగాదేవి, రామతులసీ, ఎంపీటీసీ సభ్యులు పద్మావతి, వెంకటలక్ష్మి, కనకలక్ష్మి, మండలానికి చెందిన సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు సంతాపం వ్యక్తం చేశారు. పార్టీ మండల ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథ్, తహసీల్దార్ శ్రీమన్నారాయణ, ఎంపీడీవో బి.శ్రీనివాసులు, ఈఓపీఆర్డీ నరసింగరావు, నాయకులు వెంకటేశ్వరరావు, సిద్ధార్థ, బాబీ, ఏడుకొండలు తదితరులు సంతాపం తెలిపారు.

చట్టాలు, హక్కులపై అవగాహన

పాడేరు : విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని వినియోగదారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బూడిదే చిట్టిబాబు అన్నారు. వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో పాడేరులోని కృష్ణాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఆదివారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల చట్టాలు, హక్కులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి వస్తువు కొనుగోలుపై తప్పనిసరిగా రసీదు పొందాలని , వస్తువులో నాణ్యత లేకపోయిన వినియోగదారుల ఫోరంనకు ఫిర్యాదు చేయడంతో తగిన న్యాయం జరుగుతుందన్నారు. డిజిటల్ వర్తకంపై వినియోగదారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. వినియోగదారుల సంఘాల సమాఖ్య ప్రతినిధులు రమేష్, ఉపాధ్యక్షురాలు రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నేడు

హుకుంపేట: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలతో ఆదివారం అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు తెలిపారు. ఉదయం 10గంటలకు సమావేశంప్రారంభమవుతుందని, పార్టీ శ్రేణులంతా హాజరుకావాలని కోరారు.

క్రిస్మస్ వేడుకకు సర్వం సిద్ధం

- విద్యుత్‌దీపాలంకరణలో ముస్తాబైన చర్చిలు
- ప్రత్యేక ప్రార్థనలకు పూర్తయిన ఏర్పాట్లు



కొత్తభల్లుగూడ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సొసైటీ వ్యవస్థాపకుడు మాణిక్యం, తదితరులు



జి.మాడుగులలో సువార్త ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పాస్టర్ ప్రభాకర్‌రావు

అనంతగిరి: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని అరకు నియోజకవర్గంలోని క్రైస్తవ ప్రార్థన మందిరాలు నూతనశోభ సంతరించుకున్నాయి. చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవ సోదరుల ఇళ్లను స్టార్‌లు, క్రిస్మస్ ట్రీలు, విద్యుత్ కాంతులతో ముస్తాబయ్యాయి. చర్చిల్లో క్యారెల్స్ నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. క్రీస్తు జీవిత ఘట్టాలను నాటిక రూపంలో చిన్నారులు ప్రదర్శించారు. శాంతాక్లాజ్ వేషధారుణలో చిన్నారులు సందడి చేశారు. చర్చిల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ప్రార్థనలు చేశారు. కొత్తవలస, హెక్టగుడ, లక్ష్మీపురం, అనంతగిరి, దండబాడు తదితర గ్రామాల్లోని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు జరగనున్నాయి.

అరకులోయ రూరల్: మండలంలో కొత్తభల్లుగూడ పంచాయతీ కేంద్రంలో హెచ్‌జేసీఎం సొసైటీ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక క్రైస్తవ చర్చిలో పాస్టర్ మాణిక్యం, జ్ఞానమ్మ దంపతులు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అన్నదానం నిర్వహించారు, పేదలకు రగ్గులు పంపిణీ చేసి వారి సేవభావం చాటుకున్నారు. పాస్టర్ జక్కయ్య, రాజేష్‌కుమార్, పీటర్, సంజీవ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలో పలు గ్రామాల్లో చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకున్నారు. జి.మాడుగుల, చుట్టుమెట్ట, రచ్చపల్లి, నూరిమెట్ట, నుర్మతి, బందవీధి, జీజె కళాశాల వద్ద, పాత రెవెన్యూ ఆఫీసు కాలనీ, జీఎం కొత్తూరు, పాత పంచాయతీ ఆఫీస్ సమీపంలోని చర్చిలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. సింగర్భ పంచాయతీ రచ్చపల్లి గ్రామంలో గల క్రీస్తు సెంట్రల్ చర్చ్ పాస్టర్ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ఐక్య క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జి.మాడుగులలో థింసా నృత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో క్రీస్తు కీర్తనలతో క్రైస్తవ సోదరులు సందడి చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఒకొరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.పాస్టర్ ప్రభాకర్‌రావు సువార్త ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డిబాబు, గణపతి తదితరులు పాల్గొన్నారు.



వై.రామవరం రింగురోడ్డులోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

వై.రామవరం: స్థానిక రింగురోడ్డులోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు చర్చి వ్యవస్థాపకులు బొంకు జార్జి కుటుంబరావు ఆధ్వర్యంలో ఐక్య క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాకినాడ ఎల్‌ఈఎఫ్ పాస్టర్‌లు స్టీఫెన్ సత్యం, పీటర్‌సన్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం విందు ఏర్పాటు చేశారు. లూథరన్ చర్చి పాస్టర్ గాబ్రియేల్, సంఘ పెద్దలు నహూం, నారాయణరావు, విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రికెట్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న ఎంపీపీ సవలం అమల, నాయకులు

చింతూరు: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, యువత క్రీడల ద్వారా మంచి అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశముందని ఎంపీపీ సవలం అమల అన్నారు. చింతూరులో ఆదివారం జరిగిన సకీనా మెమోరియల్ మెగా క్రికెట్ టోర్నమెంటును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ క్రీడల ద్వారా యువత తమ ప్రతిభను చాటుకునే వీలుంటుందన్నారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహద పడతాయన్నారు. యువత క్రికెట్ ప్రాక్టీస్ చేసుకునేందుకు గాను తనవంత సాయంగా క్రికెట్ నెట్ అందివ్వనున్నట్టు ఆయన తెలిపారు. చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలకు చెందిన 88 టీంలు పాల్గొంటున్న ఈ మెగా టోర్నమెంట్ జనవరి 30వ తేదీ వరకు కొనసాగనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంటు విజేతలకు ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు అందించనున్నట్టు పేర్కొన్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు, నాయకులు రామలింగారెడ్డి, జహంగీర్, అహ్మద్‌అలీ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సురేష్, రాజు, కృష్ణ, నిర్వాహకులు అక్బర్‌అలీ, హసన్‌అలీ, గణేష్, ప్రదీప్, సూరి పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రాల అందజేత



ఉద్యోగ పత్రాలతో విద్యార్థులు, అనూషా సుబ్రహ్మణ్యం

అనకాపల్లి: విద్యార్థి దశ నుంచి చదువులో శ్రద్ధ కనబరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని గవరపాలెం ఆదినారాయణ మహిళా కళాశాల డైరెక్టర్ కొణతాల అనూషాసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో ఇటీవల క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు పొందిన యువతకు నియాయమక పత్రాలను అందించి, మాట్లాడారు.

ఈ నెల 21న మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో 96 మంది పూర్వ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఇందులో 28 మందికి ఉపాధి కల్పిస్తూ నియామక పత్రాలను అందించినట్లు పేర్కొన్నారు. కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులకు దశల వారీగా జాబ్‌మేళాలు నిర్వహించి, ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ఉద్యోగార్థులు పాల్గొన్నారు.

చిల్లర దుకాణంలో మద్యం పట్టివేత

కశింకోట: పెంకుల ఫ్యాక్టరీ వద్ద దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 12 క్వార్టర్ సీసాలను ఆదివారం పట్టుకున్నట్లు హెచ్‌సీ సూర్యారావు తెలిపారు. జగన్నాథం చిల్లర దుకాణంలో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించి,బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా నూకాంబిక పండగ

రావికమతం: మేడివాడలో అమ్మవారి పండగ ఆదివారం ఘనంగా జరిగింది. నూకాంబిక అమ్మవారికి పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమత్ వ్రతం



ఆంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరి మెట్లమార్గంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హనుమత్ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం 6.30నుంచి 7గంటల వరకు స్వామికి పంచామృతాభిషేకం, 7 నుంచి విశేష అలంకరణ, 7.30 గంటల నుంచి లక్ష తమలపాకుల పూజ, సింధూర పూజ చేశారు. 9 గంటల నుంచి పట్టాభిషేక పారాయణ, 9.30 గంటల నుంచి విశేష హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఏఈవో నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముగిసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవం



ఉత్సవానికి విచ్చేసిన జనం

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో స్థానిక మెయిన్‌రోడ్డు కుంచావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవం శనివారం రాత్రి ముగిసింది. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా విచ్చేసిన ప్రజలు గౌరీపరమేశ్వరులను దర్శించుకుని, నేలవేషాలు, స్టేజ్‌ప్రొగ్రాంలను తిలకించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు(అబ్బులు) పర్యవేక్షణలో, పట్టణ సీఐ దాడి మోహన్‌రావు పర్యవేక్షించారు.

వెంకటాద్రిపై ఘనంగా ధనుర్మాసోత్సవాలు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం తిరుప్పావై సేవాకాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి